

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 25-06-2026 | సంపుటి - 29 | సంచిక -33 | రూ : 4 | పేజీలు: 8

## మేమొచ్చాక యూరియా యాప్‌ను బంగాళాఖాతంలో పడేస్తాం!

- ఎన్నికలుంటేనే సీఎంకు రైతుభరోసా గుర్తొస్తుంది: కేటీఆర్

ఖమ్మం: 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడో పంటకూ రైతుబంధు ఇవ్వాలని కోరిన రేవంత్‌రెడ్డి ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టారు. గతంలో పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల సమయంలో సీఎం డబ్బులు విడుదల చేశారు. ఈ నెల 30న మళ్లీ విడుదల చేస్తున్నారంటే ఏవో ఎన్నికలు ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక యూరియా యాప్‌ను బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. భారాస హయాంలో కేసీఆర్ తరువాయి 2లో





## ఏపీ మైనింగ్‌లో నయా చరిత్ర: జొన్నగిరి నుంచి

# తొలి బంగారం విడుదల

- తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్థ నిర్వహణకు బోర్డును పటిష్ఠం చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తుంగభద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి.. భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర డ్యాం, నదీ ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాజోలిబండ నీటి మళ్లింపు పథకం (ఆర్డీఎస్) కింద జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉందన్నారు. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి తుంగభద్ర తరువాయి 2లో

## కేంద్రం పర్యవేక్షణలో మెట్రో విలువ నిర్ధారణ



- వచ్చేవారం రంగంలోకి దిగనున్న ఎస్‌బీఐ క్యాప్స్
- సీఎస్‌తో సచివాలయంలో ఎల్‌అండ్‌టీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్: మెట్రోరైలు మొదటిదశ ప్రాజెక్ట్ విలువ నిర్ధారణ ఈసారి పూర్తిగా కేంద్రం పర్యవేక్షణలో జరగనుంది. మొదటిదశ ప్రాజెక్ట్ విలువ నిర్ధారణ, స్వాధీనానికి రుణ సేకరణ, రెండోదశ విస్తరణ, ఇతర అంశాలపై తిరిగి సమగ్ర అధ్యయనం చేయడానికి కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు. నియామకానికి సంబంధించి కేంద్రం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే ఎస్‌బీఐ రంగంలోకి దిగే అవకాశం ఉంది. వచ్చేవారం నుంచి మదింపు ప్రక్రియ ప్రారంభిస్తారని సమాచారం. తరువాయి 2లో

# మళ్లీ చైనాదే హవా

# అగ్రస్థానంలోకి 'లైన్‌షైన్'



- సొంత టెక్నాలజీతో ప్రపంచాన్ని అబ్బురపరిచిన చైనా
- సూపర్‌కంప్యూటర్లలో టాప్
- అమెరికాకు చెందిన ఎల్ క్యాపిటన్‌ను దాటిన చైనా లైన్‌షైన్
- దాదాపు దశాబ్దం తర్వాత చైనాకు తిరిగి నంబర్ వన్ స్థానం
- పూర్తిగా దేశీయ టెక్నాలజీతో ఈ సూపర్ కంప్యూటర్ నిర్మాణం
- ఈ ర్యాంకింగ్ ఏఐ సామర్థ్యానికి కొలమానం కాదంటున్న నిపుణులు

2లో



## పాక్ గగనతలంలోకి

# ఎయిరిండియా విమానం

విచారణకు ఆదేశం 2లో

- పాకిస్థాన్ గగనతలంలోకి కొద్ది దూరం వెళ్లిన ఎయిరిండియా విమానం
- అమృతసర్‌లో ల్యాండింగ్ సమయంలో పొరపాటున జరిగిన ఘటన
- అంతర్గత విచారణ జరుపుతున్నామని సంస్థ వెల్లడి
- 2025 ఏప్రిల్ నుంచి భారత విమానాలపై పాకిస్థాన్ నిషేధం
- నిషేధం కారణంగా భారత విమానయాన సంస్థలకు పెరుగుతున్న ఆర్థిక భారం

## నేడు ఒకే వేదికపైకి

# ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు



- రేపు తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం
- హాజరుకానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు కర్ణాటక సీఎం డీకే శివకుమార్
- రూ. 51కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి
- 2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ఠ చర్యలు

2లో

## భారత్‌కు ఊరట.. 4 నెలల కనిష్ఠానికి

# ముడి చమురు ధరలు

- 76 డాలర్ల సమీపంలో బ్రెంట్ క్రూడ్ ధర
- డబ్ల్యూటీఐ బ్యారెల్ ధర 72 డాలర్లు
- నెల రోజుల్లో 20 శాతానికి పైగా తగ్గిన ధరలు
- అమెరికా-ఇరాన్ చర్చలతో తొలగిన సరఫరా భయాలు
- భారత్‌కు దిగుమతి వ్యయంలో ఊరట


2లో



## పవన్‌పై దాడి సహించేది లేదు

- డిప్యూటీ సీఎం పవన్‌పై గొడ్డలి పార్టీ పనిగట్టుకుని కుట్రలు చేస్తోందని సీఎం ఆరోపణ
- పవన్‌పై నోరెత్తితే మూయించే శక్తి తమకుందని చంద్రబాబు తీవ్ర హెచ్చరిక

2లో



# ‘తుంగభద్ర’ వాటాలో కేంద్రం జోక్యం చేసుకోవాలి

హైదరాబాద్: తుంగభద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి.. భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర డ్యాం, నదీ ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాజోలిబండ నీటి మళ్లింపు పథకం (ఆర్డీఎస్) కింద జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉందన్నారు. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి తుంగభద్ర బోర్డును పటిష్ఠం చేయాలని కోరారు. బుధవారం సాయంత్రం జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆర్డీఎస్ ఆనకట్ట ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను గుర్తించాలని కోరారు. ఆర్డీఎస్ డైవర్షన్ కెనాల్ ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్యాకేజీ 1, 2 పనులు చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సీఎంలతో జరిగే సమావేశంలో ప్రస్తావించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటి మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2004లో నిపుణుల కమిటీ సూచించిన విధంగా ఇప్పటి వరకు పూడికతీత చర్యలు చేపట్టలేదని..తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం తీసుకోవాలని చర్చించారు. పూడికతీతతో పాటు 2004లో నిపుణుల కమిటీ సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రమివ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలన్నారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలన్నారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వాడుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతూ తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో నీటి నిర్వహణను మెరుగుపరిచే దిశగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్రంతో చర్చలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్డీఎస్ ఆయకట్టుపై ఆధారపడిన రైతుల ప్రయోజనాలకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**

ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి కాలువ ప్రవేశ ద్వారం వద్ద పేరుకుపోయిన పూడికను తొలగించడం, సరైన గ్రేడియంట్లను పునరుద్ధరించడం, నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టడం గురించి సమావేశంలో చర్చించారు. నదీ ప్రవాహాన్ని స్థిరీకరించేందుకు రివెట్‌మెంట్ పనుల గురించి నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులపైనా చర్చ జరిగింది. తక్షణ చర్యగా డ్రెడ్జింగ్ చేపట్టడం అత్యంత ఆచరణ సాధ్యమైన పరిష్కారాలతో ఒకటిగా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది.

# మేమొచ్చాక యూరియా యాప్‌ను బంగాళాఖాతంలో పడేస్తాం!

ఖమ్మం: ‘ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడో పంటకూ రైతుబంధు ఇవ్వాలని కోరిన రేవంత్‌రెడ్డి ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టారు. గతంలో పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల సమయంలో సీఎం డబ్బులు విడుదల చేశారు. ఈ నెల 30న మళ్లీ విడుదల చేస్తున్నారంటే ఏవో ఎన్నికలు ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు’ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక యూరియా యాప్‌ను బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. భారాస హయాంలో కేసీఆర్ 11 సార్లు రైతుబంధు రూపంలో రూ.73 వేల కోట్లను అన్నదాతల ఖాతాల్లో వేశారన్నారు. గత రెండున్నరేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు దిల్లీ వెళ్లొచ్చినా పైసా తెచ్చింది లేదన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన ‘సర్’పై భారాస బూత్ లెవల్ ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తలకు శిక్షణ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... ‘‘భారాసకు అవకాశం ఇవ్వకుంటే విశ్రాంతి తీసుకుంటానని ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ బాహాటంగానే చెప్పారు. ఆయన మాటలు వినకుండా కాంగ్రెస్‌ను గెలిపించినందుకు నష్టపోయిందెవరో అందరూ ఆలోచించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్‌ను ఏడు రకాల వడ్లకు కుదించింది. భవిష్యత్తులో అదీ ఉండదేమో మరి. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు ఇచ్చే దిక్కులేదు. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అటుంచి.. ఎన్నికల హామీ ప్రకారం మహిళలకు రూ.2,500 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకొంటా. ముఖ్యమైన శాఖలన్నీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రుల చేతిలోనే ఉన్నా... వారితో జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదు’’ అని విమర్శించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# మళ్లీ చైనాదే హవా అగ్రస్థానంలోకి ‘లైన్‌షైన్’

సూపర్ కంప్యూటర్ల రంగంలో చైనా మరోసారి సత్తా చాటింది. దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను ఆవిష్కరించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ సూపర్ కంప్యూటింగ్ కాన్ఫరెన్స్‌లో విడుదల చేసిన ‘టాప్ 500’ జాబితాలో చైనాకు చెందిన ‘లైన్‌షైన్’ సిస్టమ్ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఇప్పటివరకు టాప్‌లో ఉన్న అమెరికాకు చెందిన ‘ఎల్ క్యాపిటన్’ రెండో స్థానానికి పడిపోయింది. షెన్‌జెన్‌లోని నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ లైన్‌షైన్ సిస్టమ్, సెకనుకు 2.198 ఎగ్జాఫ్లాప్‌ల వేగాన్ని నమోదు చేసింది. అమెరికాలోని లారెన్స్ లివర్‌మోర్ నేషనల్ ల్యాబొరేటరీలో ఉన్న ఎల్ క్యాపిటన్ (1.809 ఎగ్జాఫ్లాప్‌లు) కంటే ఇది సుమారు 2022 శాతం అధికం. 2017లో సన్‌వే టైహులైట్ తర్వాత, చైనా ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం ఇదే తొలిసారి. మూడేళ్ల తర్వాత ఈ జాబితాలో అడుగుపెట్టిన చైనా, నేరుగా నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

**సొంత టెక్నాలజీతో సత్తా**

అమెరికా టెక్నాలజీ ఆంక్షలు ఎదుర్కొంటున్న తరుణంలో, ఈ లైన్‌షైన్ సూపర్ కంప్యూటర్‌ను పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో నిర్మించడం చైనా సాధించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్నారు. ఇందులో కస్టమ్ ఆర్మ్ వీ9 ఆధారిత లింగ్‌కున్ ఎల్ఎక్స్2 సీపీయూలు, సొంత ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ, కైలిన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించారు. ఇందులో 1.37 కోట్ల కోర్‌లు ఉన్నాయి. వాతావరణ మార్పుల అంచనా, ఇంజినీరింగ్, డ్రగ్ డిస్కవరీ, ఏఐ వంటి కీలక రంగాల్లో పరిశోధనలకు ఈ సూపర్ కంప్యూటర్ సేవలు అందిస్తుంది. అయితే, ఈ టాప్ 500 జాబితా కేవలం సంప్రదాయ కంప్యూటింగ్ పనుల వేగాన్ని మాత్రమే కొలుస్తుందని, ఆధునిక ఏఐ సామర్థ్యానికి ఇది సరైన కొలమానం కాదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ, దేశీయ టెక్నాలజీతో చైనా ఈ ఘనత సాధించడం విశేషం.

# పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం

ఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళుతున్న ఎయిరిండియా విమానం ఒకటి పొరపాటున పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేసే ప్రయత్నంలో భాగంగా ‘గో రౌండ్’ (తిరిగి గాల్లోకి లేవడం) చేస్తుండగా సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. టాటా గ్రూప్‌కు చెందిన ఎయిరిండియా ఈ విషయాన్ని ఒక ప్రకటనలో ధృవీకరించింది. విమాన సిబ్బంది ఏఐ479 విమానాన్ని అమృత్‌సర్‌లో ల్యాండ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా, సాంకేతిక కారణాలతో గోరౌండ్ చేయాల్సి వచ్చిందని, ఈ క్రమంలో పాక్ గగనతలంలోకి కొద్ది దూరం ప్రవేశించిందని సంస్థ తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత నియంత్రణ సంస్థలకు సమాచారం అందించామని, సంస్థాగతంగా కూడా అంతర్గత విచారణ జరుపుతున్నామని ఎయిరిండియా పేర్కొంది. ప్రయాణికుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసింది. 2025 ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి, సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత పాకిస్థాన్.. భారత్‌కు చెందిన అన్ని రకాల సివిల్, మిలటరీ విమానాలపై తమ గగనతలాన్ని మూసివేసింది. ఈ నిషేధాన్ని నెలనెలా పొడిగిస్తూ వస్తోంది. ఇటీవలే ఈ నిషేధాన్ని జూలై 24 వరకు పొడిగించినట్లు పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. భారత్ కూడా పాక్ విమానాలపై ఇదే తరహా నిషేధాన్ని అమలు చేస్తోంది. ఈ నిషేధం కారణంగా ఎయిరిండియా, ఇండిగో వంటి భారత విమానయాన సంస్థలు యూరప్, ఉత్తర అమెరికా, మధ్య ఆసియా దేశాలకు వెళ్లేందుకు సుదీర్ఘమైన, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులు పెరిగి సంస్థలపై కోట్ల రూపాయల ఆర్థిక భారం పడుతోంది.

# పవన్‌పై దాడి సహించేది లేదు

డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ‘గొడ్డలి పార్టీ’ పనిగట్టుకుని కుట్రలు పన్నుతోందని, ఆయనపై అనవసరంగా నోరు పారేసుకుంటే సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం కర్నూలు జిల్లా జొన్నగిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై గొడ్డలి పార్టీ లేనిపోని దుష్ప్రచారం చేస్తోంది. పవన్‌ను టార్గెట్ చేసుకుని కుట్రలు పన్నుతున్నారు. ఆయనపై అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. మళ్లీ నోరెత్తకుండా ఇలాంటి వాళ్ల నోరు మూయించే శక్తి మాకుంది” అని హెచ్చరించారు. విజయవాడ సాయికృష్ణ అదృశ్యం వంటి ఘటనలకు కులాన్ని ఆపాదిస్తూ విషం చిమ్ముతున్నారని, కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడంలో గొడ్డలి పార్టీ నాయకుడు దిట్ట అని విమర్శించారు. ప్రతి ఘటనకూ కులం రంగు పూసి రెచ్చగొట్టడం, తప్పులు చేసి ప్రజలను మభ్యపెట్టడం వారికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో గత ప్రభుత్వ పాలకమండలి ఘాతుకాలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. “తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా కల్తీ నెయ్యిని గత ప్రభుత్వంలోని పాలకమండలి వాడింది. లడ్డూ ప్రసాదం విషయంలో గొడ్డలి పార్టీ పాలనలో చేసిన ఘాతుకాలు ఇప్పుడు బయటపడ్డాయి” అని తెలిపారు. ఆ కుట్రలన్నీ బయటపడటంతోనే ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టేందుకు గొడ్డలి పార్టీ నాయకుడు దేవాలయాల చుట్టూ తిరుగుతున్నాడని, ఎన్ని దండాలు పెట్టినా ఇక లాభం లేదని ఎద్దేవా చేశారు. “గొడ్డలి పార్టీ నాయకుడు ఆచరించే మతాన్ని మేమంతా గౌరవిస్తున్నాం. కానీ వాళ్లు దేవాలయాల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. దాన్ని చూస్తూ ఊరుకోం” అని చంద్రబాబు స్పష్టం చేశారు.

* **గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు గొడ్డలి పార్టీ అండ!**

రాజకీయ ముసుగులో గొడ్డలి పార్టీ (ప్రతిపక్ష పార్టీ) గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు అండగా నిలుస్తోందని, యువతను చెడు మార్గం పట్టించి బలి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా విమర్శించారు. జొన్నగిరిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గొడ్డలి పార్టీకి విధ్వంసమే విజన్ అని, ఫేక్ ప్రచారమే వారి విధానమని, రప్పా రప్పా రాజకీయాలే మేనిఫెస్టో అని ధ్వజమెత్తారు. “బాబాయి మర్డర్ నుంచి మొన్నటి పాస్టర్ రోడ్డు ప్రమాదం వరకు వాళ్లు కుట్రలనే నమ్ముకున్నారు. పోస్టర్లకు జంతు బలులు ఇవ్వటం వారి నైజం. గొడ్డలి పార్టీకి భవిష్యత్తు లేదు” అని చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకులు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా, ఇప్పుడు డీఎస్సీపై బురద చల్లుతున్నారని ఆయన ఆరోపించారు. తాము హామీ ఇవ్వనప్పటికీ 10,800 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ స్కీమ్‌లోకి తీసుకొచ్చామని, దీనివల్ల ఒక్కో ఉద్యోగికి రూ.3 కోట్ల వరకు ప్రయోజనం కలుగుతుందని సీఎం వివరించారు. రాయలసీమకు ఏం చేశారో గొడ్డలి పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. “సీమకు నీళ్లిచ్చే విషయంలో వారికి చిత్తశుద్ధి లేదు. కనీసం ప్రాజెక్టు గేట్లు కూడా మరమ్మత్తులు చేయించలేదు. మేం కర్ణాటకతో కలిసి తుంగభద్రకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం” అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగిందని, వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను వెల్లడిస్తూ ఇకపై ప్రోగ్రెస్ రిపోర్టులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# భారత్‌కు ఊరట.. 4 నెలల కనిష్ఠానికి ముడి చమురు

కొన్ని రోజుల క్రితం వరకు ప్రపంచ మార్కెట్లను కలవరపెట్టిన చమురు ధరలు ఇప్పుడు క్రమంగా దిగొస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా ఇరాన్ మధ్య శాంతి ప్రయత్నాలు ముందుకు సాగడం ఇందుకు ప్రధాన కారణాలు. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఇది చమురు దిగుమతులపై ఆధారపడే భారత్‌కు శుభవార్తగా ఊరటనిచ్చే విషయం. బుధవారం ట్రేడింగ్‌లో అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల సమీపంలో కొనసాగింది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ధర 72 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒకే రోజులో ఈ రెండు సూచీలు ఒక శాతానికి పైగా తగ్గాయి. గత నెల రోజుల్లో బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు 20 శాతానికి పైగా పడిపోవడం గమనార్హం. ఇరాన్ సంక్షోభం ప్రారంభమైన సమయంలో హర్మూజ్ జలసంధి మీదుగా చమురు సరఫరా దెబ్బతింటుందనే భయాలు మార్కెట్లను కలవరపరిచాయి. అయితే పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో నిలిచిపోయిన చమురు ట్యాంకర్లు మళ్లీ ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం రావడంతో మార్కెట్లలో ఆందోళన తగ్గింది. అమెరికా, ఇరాన్‌తో పాటు ప్రాంతీయ దేశాల మధ్య జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు కూడా పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నాయి. సరఫరాలో పెద్ద అంతరాయం ఉండకపోవచ్చనే అంచనాలు బలపడటంతో చమురు ధరలపై ఒత్తిడి పెరిగింది. దీంతో ప్రపంచ ఇంధన మార్కెట్లలో గత కొంతకాలంగా కనిపించిన ఆందోళన తగ్గుముఖం పట్టింది. చమురు ధరల తగ్గుదల భారత్‌కు ప్రత్యేకంగా లాభదాయకంగా మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దేశం తన అవసరాల్లో ఎక్కువ భాగం ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. కాబట్టి ధరలు తగ్గితే దిగుమతి వ్యయం తగ్గుతుంది. ద్రవ్యోల్బణంపై ఒత్తిడి కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉంటుంది. అయితే పరిస్థితి పూర్తిగా సద్దుమణిగిందని చెప్పలేమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఏదైనా అంతరాయం ఏర్పడితే ధరలు మరోసారి పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల ఇంధన మార్కెట్లు ఇంకా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి.

# నేడు ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు

ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త జవసత్వాలు రానున్నాయి. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన స్పిల్‌వే గేట్లను నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా పాల్గొంటారు. మూడు రాష్ట్రాలకు చెందిన కీలక నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తం రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త స్పిల్‌వే గేట్లను ఏర్పాటు చేశారు. 2024 ఆగస్టులో సంభవించిన వరదల సమయంలో ప్రాజెక్టు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. ఇది తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆ సమయంలో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వంలోని సాంకేతిక బృందం తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటును ఏర్పాటు చేసి నీటిని నియంత్రించింది. ఈ ఘటన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి ప్రాజెక్టును పరిశీలించింది. భద్రతా కారణాల దృష్ట్యా పాత గేట్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుల మేరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు సంయుక్తంగా పనులు చేపట్టాయి. యుద్ధప్రాతిపదికన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 33 కొత్త గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని, నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. రాయలసీమకు జీవనాడిగా భావించే ఈ ప్రాజెక్టు ద్వారా కుడి ప్రధాన కాలువ కింద కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సుమారు 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. అనేక గ్రామాలకు తాగునీటి అవసరాలు కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోంది. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలందరూ హోస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# కేంద్రం పర్యవేక్షణలో మెట్రో విలువ నిర్ధారణ

హైదరాబాద్: మెట్రోరైలు మొదటిదశ ప్రాజెక్ట్ విలువ నిర్ధారణ ఈసారి పూర్తిగా కేంద్రం పర్యవేక్షణలో జరగనుంది. మొదటిదశ ప్రాజెక్ట్ విలువ నిర్ధారణ, స్వాధీనానికి రుణ సేకరణ, రెండోదశ విస్తరణ, ఇతర అంశాలపై తిరిగి సమగ్ర అధ్యయనం చేయడానికి కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు. నియామకానికి సంబంధించి కేంద్రం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే ఎస్‌బీఐ రంగంలోకి దిగే అవకాశం ఉంది. వచ్చేవారం నుంచి మదింపు ప్రక్రియ ప్రారంభిస్తారని సమాచారం.

**మదింపు ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి**

ఇప్పటికే ఐడీబీఐ క్యాపిటల్‌తో ఆర్థిక, న్యాయపరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం మదింపు చేయించింది. ఈ నివేదికలోని వివరాల ఆధారంగా తిరిగి నిర్ధారణ చేస్తారా? లేక పూర్తిగా మొదటి నుంచి మదింపు చేపడతారా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. మెట్రోరైలు మొదటి దశను రాష్ట్రప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని నిర్ణయించిన అనంతరం ప్రాజెక్ట్ విలువ మదింపు చేయడానికి టెండర్ ప్రక్రియ ద్వారా ఐడీబీఐ క్యాపిటల్‌ను లావాదేవీల సలహాదారుగా ఎంపిక చేసింది. ఆర్థిక, చట్టపరమైన అంశాలను ఈ సంస్థ మదింపు చేసి నివేదిక ఇచ్చింది. మెట్రోకి ఉన్న భూములు, మాల్స్, ప్రాజెక్ట్‌ను మదింపు చేసి వాటి విలువ రూ.19,136 కోట్లు (రెడీ టూ యూజ్) నుంచి రూ.22,102 కోట్ల (ఫ్రీహోల్డ్) వరకు ఉంటుందని అంచనా వేసింది. దిల్లీ మెట్రో రైలు సంస్థ(డీఎంఆర్‌సీ)కు అనుబంధంగా ఉన్న దిల్లీ మెట్రో ఇంటర్నేషనల్ లిమిటెడ్ (డీఎంఐఎల్) సాంకేతిక అంశాల మదింపు చేపట్టి నివేదిక సమర్పించింది. ఈ రెండు ఏజెన్సీలు ఇచ్చిన నివేదిక అనంతరం మంత్రిమండలి ఆమోదంతో రూ.15వేల కోట్లకు కొనుగోలు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఎల్అండ్‌టీతో రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 29న వాటా కొనుగోలు ఒప్పందం చేసుకుంది.

**గతంలో చేసిన అనుభవం...**

రాష్ట్ర ప్రభుత్వం పిలిచిన టెండర్లలోనూ గతంలో ఎస్‌బీఐ క్యాప్స్ పాల్గొంది. అధిక ధర కోట్ చేయడంతో ఎంపిక కాలేదు. ఇప్పుడు కేంద్రం ఈ సంస్థను ఎంపిక చేసింది. గతంలో నిజాం షుగర్స్ టేకోవర్‌లో పాలుపంచుకున్న అనుభవం ఎస్‌బీఐ క్యాప్స్‌కు ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

## టీఆర్ఎస్ నాయకులపై దాడి హేయకరం: వీరన్న



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : ములుగు జిల్లా మంగపేట మండలం వాడేగూడెంలో ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించేందుకు వెళ్లిన టీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు అక్రమంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు టీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి డి. వీరన్న అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో జరిగిన అత్యవసర కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి నదిని చెరబట్టి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక తవ్వకాలు చేయిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించడానికి వెళ్లిన నాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్న ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అక్రమ తవ్వకాలు వెంటనే నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవి నాయక్, లకావత్ సురేష్, ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జి వాసం రామకృష్ణ దొర, అశ్వారావుపేట ఇంచార్జ్ వెంకట్ పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ తొలి సమావేశంలో పలు తీర్మాణాలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ తొలి సర్వసభ్య సమావేశం బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ బానోత్ లాల్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైర్మన్, 12 మంది పాలకవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పాలకవర్గ ఏర్పాటుపట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో మిర్చి, పత్తి, మొక్కజొన్న, అపరాలు తదితర పంటల కొనుగోలు కోసం కేంద్రాలను ఏర్పాటు చేయుటకు కృషి చేస్తామని ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. మార్కెట్ యార్డును అభివృద్ధి పదంలో నడిపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూక్యా జనార్ధన్, కార్యదర్శి, పి.ఎ.సి.ఎస్. చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## 10 లక్షల రూపాయల సిసి రోడ్ ప్రొసిడింగ్ కాపీని అందజేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కుంభి గ్రామంలో సుమారు పది లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం యొక్క ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు .నిధులు మంజూరు చేసి ఇచ్చినందుకు మన రేవంత్ రెడ్డి కి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి మాజీ శాసనసభ్యులు గాడ్డి విఠల్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ విజయ్ ఉప సర్పంచ్ సిందేవిజయ,గజానంద్,విఠాళేశ్వర్ మరియు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు పంపిణీ




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రముఖ బిజెపి నాయకుడు, ఆర్కే ఎస్ ఫౌండర్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ గత జనవరిలో తన జన్మదినం సందర్భంగా అభిమానులు అందజేసిన నోట్ బుక్కులు పెన్నులు ప్యాడ్లను, పట్టణంలోని దేవరకొండ రోడ్డు ప్రతీక్ రెడ్డి జూనియర్ కళాశాల సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ముఖ్యఅతిథిగా హుజూర్నగర్ మాజీ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి పాల్గొని విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు పరీక్ష పాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి 12 సంవత్సరాల పరిపాలన పూర్తి అయిన సందర్భంగ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని ఇందులో ఉన్నత విద్య చదివిన ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందజేస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి చదివిన పాఠశాలకు తల్లిదండ్రులకు గుర్తింపు గౌరవం తేవాలన్నారు. విద్యార్థులు ముఖ్యంగా మూడు విషయాలు పాటించాలని మంచిగా వినాలని దొరికిన ప్రతి పుస్తకాన్ని చదవాలని ప్రతి విషయాన్ని విశ్లేషించాలని సూచించారు, కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ అబ్దుల్ కలాం లను ఆదర్శంగా తీసుకొని భారతదేశ భావి భారత పౌరులుగా ఈ దేశానికి పేరు తేవాలన్నారు. ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే వారు పేద విద్యార్థులని వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తే మంచి దేశ పౌరులుగా దేశానికి సేవ చేసేవారిగా ఎదుగుతారని తన జన్మదిన సందర్భంగా పూల బొకేలు కేకులు కాకుండా తన అభిమానులు ఇచ్చిన నోటుబుక్కులను విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. బిజెపి నాయకులు బండారు ప్రసాద్, పూతపాక సాంబయ్య కార్పొరేటర్లు కృష్ణంరాజు సాయి, వంగూరి రాఖి, బిజెపి నాయకులు ఊట్కూరు వెంకటరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూసుఫోద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనలో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్***

ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఒక వజ్రాయుధం లాంటిదని స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహణకు ఓటరు జాబితాను మరింత సమగ్రంగా , పారదర్శకమైనదిగా రూపొందించుటకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్ 2026)లో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ 2026పై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు గాను జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 2కె రన్ ను మెదక్ జిల్లా కేంద్రంలోని. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి రాందాస్ చౌరస్తా వరకు వరకు ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ఆధారపడి ఉంటుందని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు, అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్న పౌరులు https://voters.eci.gov.in లో తమ పేర్లు ను తనిఖీ చేసుకోవచ్చునని, అవసరమైతే సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోనుటకు సహాయం కోసం బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చని అన్నారు. పారదర్శకమైన, సమగ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు (సర్) కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు.మృతి చెందిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం ద్వారా మరింత ఖచ్చితమైన ఓటరు జాబితా ను రూపకల్పన చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు




హక్కు కల్పించడమే ముఖ్యలక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు. అర్హులకు ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో అనర్హులను ఓజరు జాబితా నుండి తొలగించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో మెలిగి ప్రజాస్వామ్యంలో ఉత్తమ పౌరులుగా ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. సర్ లో ప్రజలందరి భాగస్వామ్యం అవసరం అన్నారు. సర్ కార్యక్రమం వల్ల నకిలీ ఓట్లు తొలిగిపోతాయన్నారు. యువత మత్తు పదార్థాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు.

యువత ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లాను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ పాయింట్ లో కలెక్టర్ అదనపు ఎస్పీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, తాహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్, ఆర్ అండ్ బిఈఈ వేణు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతికి వరం– విత్తన బంతులు

*** ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి**

ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా:వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పెంపకం అత్యంత కీలకమని, అందుకోసం విత్తన బంతుల తయారీ, వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), మెదక్ వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్),మెదక్ లోని ఎకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం రెండు మూడు యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన బంతుల తయారీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ



మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతం అసమతుల్యత వంటి సమస్యలకు ప్రధాన కారణం పర్యావరణ కాలుష్యమని పేర్కొన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు విస్తృతంగా చెట్లను పెంచడం అత్యవసరమని తెలిపారు. విత్తన బంతులను పెద్ద ఎత్తున తయారు చేసి వర్షాకాలంలో అడవులు తక్కువగా ఉన్న ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, బీడు భూముల్లో విసరడం ద్వారా సహజసిద్ధంగా మొక్కల పెరుగుదలకు అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ సంఖ్యలో మొక్కలను పెంచవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఆర్. శ్రీలత, వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. రాజు, ల్యాబ్ ఇంచార్జి సుధారాణి, ఎకో క్లబ్ సభ్యులు డా. వేణుగోపాలరావు, డా. విశ్వనాథ్, భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు సుధారాణి, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

*** ప్రత్యేక అధికారి ఎన్. శ్రీధర్ ఆదేశం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రత్యేక అధికారి ఎన్. శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభల ద్వారా మొత్తం 6,391 దరఖాస్తులు అందగా, వాటిలో 716 మాత్రమే పరిష్కారమయ్యాయని, మిగిలిన 5,674 దరఖాస్తులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అంశాలపై అధిక




సంఖ్యలో వినతులు వచ్చినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఆదాయ వనరులను పెంచి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని, ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం, విద్యాబోధనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వానాకాలంలో వ్యాధుల నివారణ, పచ్చదనం పెంపు, పారిశుధ్య నిర్వహణను పటిష్ఠంగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి టైమ్‌బౌండ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ రహదారి భద్రత, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు, చిన్నారుల రక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

*** భూపాలపల్లిలో 2కే రన్ నిర్వహణ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 2కే రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా "డ్రగ్స్‌కు నో చెప్పండి - ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అనే సందేశాన్ని యువతకు అందించారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు మాదక ద్రవ్యాల




నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, యువత భవిష్యత్తుపై వాటి దుష్ప్రభావాలు, కుటుంబాలు మరియు సమాజంపై పడే ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని కోరారు. డ్రగ్స్ రహిత భూపాలపల్లి జిల్లా నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విపత్కర సమయాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడంలో, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొ న్నారు. అశ్వాపురం మండలం తుమ్మల చెరువు వద్ద జరుగుతున్న డిడిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ రోహిత్ రాజు బుధవారం సందర్శించారు. శిక్షణా శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి అందుతున్న శిక్షణ తీరును పర్యవేక్షించారు. శిక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న భాదితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డీడిఆర్ఎఫ్ బృందాలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఎస్పీ చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అన్ని శాఖలతో సమన్వయం పాటిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గోదావరి నది వరదలు సంభవించినప్పుడు నదీ పరివాహక ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించడానికి ఈ బృందాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని చెప్పారు.

## పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు గోడ పత్రిక ఆవిష్కరణ



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి: ఈ నెల 26న తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు హైదరాబాదులోని స్వకులశాలి సమాజ భవనం, ఎల్బీనగర్ లోనిర్వహించబడు సందర్భంగా గోడ పత్రిక నల్లగొండ సూర్యాపేట జిల్లా కమిటీ వారు వారి కార్యాలయం ఎల్ పి టి మార్కెట్ మార్కెట్ , నల్లగొండ లో ఆవిష్కరించటం జరిగింది.ఈ సదస్సు లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ మొదలైన అంశాలపై చర్చించడం జరుగుతుంది అని వారు తెలిపారు. నల్లగొండ సూర్యాపేట జిల్లాల పద్మశాలి ఉద్యోగులందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యేశాల విశ్వ కుమార్ లతో పాటుగా జిల్లా కమిటీ సభ్యులు పున్న వేణు, ఆనందపు సత్యనారాయణ, గంజి నవీన్ కుమార్, గంజి వెంకన్న, దొంత దామోదర్, దునుకు జగదీశ్వర్, పగిడిమర్రి శివ కుమార్, చిలుకూరి గోవర్ధన్ పాల్గొన్నారు.

## పిప్రీ గ్రామానికి రూ.30 లక్షల నిధులు మంజూరు



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని పిప్రీ గ్రామానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రూ.30 లక్షల నిర్మాణ పనుల కోసం మంజూరు పత్రాన్ని అందజేశారు. గోదాం నిర్మాణం పూర్తయితే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసుకునే సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదొల్ మండల బీజేపీ నాయకులు, సర్పంచ్ లు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రజా స్ఫూర్తి కూసుమంచి: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబ భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని కూసుమంచి సిఐ సంజీవ్, తాసిల్దార్ సైదులు అన్నారు.కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయం ఆవరణంలో కూసుమంచి పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ డ్రగ్స్‌పై రూపొందించిన వీడియో ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

* **నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ సూచించారు. బుధవారం జిల్లాలోని లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామంతో పాటు జనగామ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులు 2, 10, వీవర్స్ కాలనీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, బాణాపురంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన అధికారులు ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు అయిన ఖర్చు, అందిన బిల్లులు, నిర్మాణ సామగ్రిపై జరిగిన వ్యయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కడమంచి అబ్బమ్మ ఇంటి నిర్మాణ పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించి, నిధుల విడుదల, పనుల స్థితిగతులపై ఆరా తీశారు.అనంతరం గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన అధికారులు, పక్కా ఇల్లు లేని అత్యంత నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ముందే మొదటి విడత ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం దశల వారీగా విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం కోసం అధిక అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు



లబ్ధిదారులకు సాంకేతిక సహకారం అందించి నాణ్యతతో కూడిన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. బాణాపురంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతులను త్వరితగతిన కల్పించి అర్హులైన లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే గుడిసెల్లో నివసిస్తూ కట్టెల పొయ్యిలపై వంట చేస్తున్న కుటుంబాలను గుర్తించి వారికి వెంటనే గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- **సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**
- **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నర్సింహ్మాలు అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.15లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అంచెలంచెలుగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తూ, సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతమన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, దశాబ్ద కాలంగా ఆగిపోయిన కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేయడంతో పాటు నిర్విరామంగా రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ఇలా ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తూ మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పకీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, సామిడి సంధ్య, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, నాయకులు బద్రి లింగయ్య, ఐతరాజు సత్తయ్య, రాచకొండ కృష్ణయ్య, సామిడి లింగారెడ్డి, ఊదరి లింగయ్య, రాచకొండ వెంకటేశం, ఊదరి స్వామి, గునుగంటి స్వామి, చెన్నోజు భూషణాచారి, బోనకుర్తి హరికృష్ణ, ఊదరి రవి, జంగం అంజయ్య, ఐతరాజు రవీందర్, బత్తుల సింహాచలం, కొంతం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, కాలనీ వాసులు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విఓఏ ల సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి

* **రాష్ట్ర విఓఏల సంఘం సహాయ కార్యదర్శి అంజనేయులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ఐకెపి విఓఏల సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర విఓఏల సంఘం సహాయ కార్యదర్శి ఆర్.అంజనేయులు అన్నారు. ఐకెపి విఓల రాష్ట్ర కార్యవర్గ కమిటీని ఎన్నిక జరిగింది.రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదువులైన రాష్ట్ర అద్యక్షుడిగా నాగేష్, ఉపాద్యాక్షురాలు, సహాయ కార్యదర్శి పదవులు సంగారెడ్డి జిల్లాకు చెందిన వారికి దక్కాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చాలిచాలని డబ్బులతో వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉన్న విఓఏలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ తమ సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు.గత ప్రభుత్వ హయాంలో 46 రోజుల పాటు విఓఏలు సమ్మె చేసిన సమయంలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చిందని గుర్తు చేశారు. విఓఏలకు సరైన వేతనాలు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎలాంటి సౌకర్యం లేకుండా ప్రభుత్వం అనేక రకాల అన్‌లైన్ పనులు చేయించడం ద్వారా పనిభారం పెరుగుతోందన్నారు. అతి తక్కువ గౌరవ వేతనంతో అనేక మంది విఓఏలకు కుటుంబ భారంగా మారిందన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల హామీలను నేరవేర్చడంతో పాటు విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# ఒకే కుటుంబంలో రెండు మరణాలు.. అంబేద్కర్ నగర్‌లో విషాదం



జనగామ, ప్రజస్ఫూర్తి : పట్టణం లోని అంబేద్కర్ నగర్ లో బుధవారం హృద యవిదారక ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో ఇ ద్దరు మృతి చెందడం తో ఆప్రాంతం లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, రెండేళ్ల చిన్నారి ప్రియాన్షి ప్రమాదవశా త్తు ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపు లో పడి మృతి చెందింది.చిన్నారి మృతి తో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా మనవరాలు మృతిని తట్టుకోలేక ఆమె నానమ్మ మారబోయిన నాగమ్మ తీవ్ర ఆవేదనకు గురై, మృతదేహం వద్ద విలపిస్తూ నాగ మ్మ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు వెం టనే ఆమెను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ని ర్ధారించారు.ఒకే ఇంట్లో చిన్నారి, నాన మ్మ మృతి చెందడం తో కుటుంబ స భ్యులు కన్నీరుమున్నీరుగా విలపించా రు. ఈ ఘటనతో అంబేద్కర్ నగర్ లో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# సంకల్ప్ కన్వరిజన్స్ సమావేశం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య ఇంకా ఆరోగ్య సేవల సమన్వయ అధికారి డిసి హెచ్ ఎస్ డాక్టర్ సూర్య శ్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి ఇంకా ఎస్ ఎన్ సి యు ఇన్చార్జి డాక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో సంకల్ప్ కన్వరిజన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తల్లి శిశు ఆరోగ్య ఫలితాల మెరుగుదల, హై రిస్క్ గర్భిణీలను ముందస్తుగా గుర్తించి సమర్థవంతమైన నిర్వహణ, మాతృ, శిశు మరణాల తగ్గింపు, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి సేవలను మరింత సమర్థవంతంగా అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం క్యాన్సర్ పోర్టల్ డేటా ఎంట్రీ ,రిపోర్టింగ్‌పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్, రోగుల నమోదు, రిఫరల్ ట్రాకింగ్ మరియు పోర్టల్‌లో సకాలంలో వివరాల నమోదు పురోగతిని సమీక్షించారు. క్యాన్సర్ రోగుల పర్యవేక్షణ, ఫాలోఅప్ , వైద్య సేవల అందింపును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఖచ్చితమైన , సకాలంలో డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. జిల్లాలో తల్లిశిశు ఆరోగ్య సేవలు , క్యాన్సర్ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

## విద్యార్థుల్లో గణిత నైపుణ్యాల పెంపుదలకు

# కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినూత్న చొరవ



జనగామ, ప్రజస్ఫూర్తి : విద్యార్థులు గణితం పై ఉన్న భయాన్ని వీడి ఆత్మ విశ్వాసంతో అభ్యసించి విషయావగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన 'ఫాస్ట్ మ్యాథ్స్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణితం చాలా మంది విద్యార్థులకు క్లిష్టమైన సబ్జెక్టుగా అనిపించినప్పటికీ సరైన పద్ధతుల్లో అభ్యసిస్తే సులభంగా అర్థం చేసుకోవచ్చని అన్నారు. విద్యార్థులకు గణిత సూత్రాలను సులభంగా నేర్పడం తో పాటు సమస్యలను వేగంగా పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించేందు కు ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. పుస్తకంలో ముఖ్యమైన సూత్రాలు, సరళమైన విధానాలు,నమూనా ప్రశ్నలు, పరీక్షలకు ఉపయోగపడే చిట్కాలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. జిల్లా లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ పుస్తకం సాఫ్ట్ కాపీని పంపించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గణిత ఉపాధ్యాయులు ఈ పుస్తకాన్ని తరగతి బోధనలో భాగంగా వినియోగించి విద్యార్థులకు గణితాన్ని మరింత సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమశిక్షణతో చదువుతూ గణిత సాధనకు ఎక్కువ సమయం కేటాయించాలని, పునరావృత అభ్యాసం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను పూర్తిగా అవగాహన చేసుకొని పరీక్షలకు సిద్ధమైతే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు అదనపు శిక్షణ అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.ఓ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బే గం, ప్రధానోపాధ్యాయులు అఫ్సర్, ఉ పాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలతో పాటు క్రీడ లు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతా వరణం, క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారు లను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి మండలం నిడిగొండ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల పఠన సామ ర్థ్యాలను పరిశీలించి,విద్యా ప్రమా ణాలపై ఉపాధ్యాయులతో చర్చిం చారు. ప్రతి విద్యార్థిలో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలను పెంపొం దించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలిం చిన కలెక్టర్, పారిశుద్ధ్య నిర్వహ ణలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. పాఠశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఆయన, ఆహార నాణ్యత, పరిశు భ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కట్టెలతో వంట చేయడం పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టి లో ఉంచుకుని సురక్షిత మైన వంట విధానాలను అమలు చేయాలని తెలిపారు.అనంతరం కంప్యూటర్, గణితశాస్త్రం, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించి, జీవశాస్త్ర ప్రయోగశాల ఏర్పాటు చేయాలని సూచించారు. ల్యాబ్‌ల అభివృద్ధి కి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యతో పాటు క్రీడ లకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు, టేబుల్ టెన్నిస్,చెస్, క్యారమ్,వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలను ప్రోత్సహిం చాలని సూచించారు. విశాలమైన ప్రాంగణం కలిగిన ఈ పాఠశాల ను జిల్లాలో ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టా లని ఆదేశించారు.

# పాలిటెక్నిక్ కళాశాలకు సీఎస్ఆర్ నిధులు అందజేత



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల కింద రూ.1.45 లక్షల చెక్కును బిటీపీఎస్ సీఈ బిచ్చన్న బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఇలాంటి సిఎస్ఆర్ నిధులు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు చెప్పారు. సమాజాభివృద్ధిలో భాగంగా మరిన్ని సంస్థలు కూడా విద్యా రంగ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. బిటీపీఎస్ సీఈ బిచ్చన్న మాట్లాడుతూ మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో చీరల పంపిణీ కార్యక్రమం విజయవంతం



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరిలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి అనే మహిళ ఎంతో చురుకుగా వ్యవహరిస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి తన వంతు సహాయ సహకారాలు అందించారు. లబ్ధిదారులకు చీరల పంపిణీ ప్రక్రియలో ఆమె స్వచ్ఛందంగా సేవలందించి, కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సమాజ సేవ పట్ల ఆమె చూపిన అంకితభావాన్ని పలువురు అభినందించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి తోడ్పాటును అందిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# ఖైదీలకు మాదకద్రవ్యాల అవగాహన సదస్సు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్థానిక సబ్‌జైలులో విచారణ ఎదుర్కొంటున్న ఖైదీల కోసం ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజ్ కృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటు ఒక వ్యక్తి జీవితాన్ని,వారి కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తుందో ఆయన వివరించారు. ముఖ్యంగా యువత క్షణికానందం కోసం డ్రగ్స్ బారిన పడి, ఆపై నేరాల వైపు మళ్లుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరమే కాకుండా,వాటి అక్రమ రవాణా చట్టప్రకారం అత్యంత తీవ్రమైన నేరమని, దీనివల్ల కఠినమైన జైలు శిక్షలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. జైలు నుండి విడుదలైన తర్వాత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని హితవు పలికారు.

# బస్సు సౌకర్యంతో విద్యార్థుల ప్రయాణ కష్టాలకు చెక్



లింగాల ఘణపురం / ప్రజాస్ఫూర్తి : ఆర్టీసీ బస్సు సౌకర్యంతో విద్యార్థుల ప్రయాణ కష్టాలకు చెక్ పడింది. వివరా లోకి వెళ్ళితే కళ్లెం, మాణిక్యపురం, ఏన బావి ప్రాంతం నుంచి లింగాల ఘణపు రం మండల కేంద్రం లోని మోడల్ స్కూ ల్ కు వెళ్లే విద్యార్థుల కోసం బస్సు సౌక ర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ డి.ఎం ను కలిసి విద్యార్థుల రవాణా సమస్యలను వివ రించి, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిం చాలని వినతిపత్రాని సమర్పించారు. వి జ్ఞప్తులకు స్పందించిన ఆర్టీసీ అధికారు లు బుధవారం నుంచి కళ్లెం మాణిక్య పురం, ఏనబావి ప్రాంతాల విద్యార్థులు మోడల్ స్కూల్ కు వెళ్లేందుకు బస్సు సేవలను ప్రారంభించారు. ఇప్పటి వరకు రవాణా సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందు లు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుందని ఆ నందం వ్యక్తం చేశారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం పట్ల విద్యార్థులు, తల్లి దండ్రులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్ తోపాటు ఆర్టీసీ అధికా రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవ గ్రామీణ విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత తోడ్పాటునం దిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

# సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ కె.హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ ఉద్యోగుల హాజరు, సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి నిర్వహించే సర్ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్ కార్యక్రమం సర్వే పత్రాలను పంచాయతీల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పంపిణీ చేయాలని, ఓటరు జాబితాలో ఓటర్ల నూతన పాస్ ఫోటోల కోసం ఫోటోగ్రాఫర్లతో మాట్లాడి గ్రామాలలో తక్కువ ధరకు పాస్ ఫోటోలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపి ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి ఫారంలో పొందుపరిచిన వివరాలను యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జైనూర్ తహసిల్దార్ ఆడ బిర్షావ్, ఆర్ ఐ మోహన్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బేతోలులో సవార్ల సందడి మొక్కులతో భక్తులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామంలో బుధవారం సవార్లకు ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పీరీల గుండం వద్ద భక్తులు చేసిన పాల మటికిలతో ఫాతిహాలు నిర్వహించి పానకం పంపిణీ చేశారు. మతసామరస్యానికి ప్రతీక హిందూ ముస్లింలు సోదర భావంతో మొహరం వేడుకలు గ్రామంలో అత్యంత వైభవంగా (పీర్ల పండుగ) భక్తిశ్రద్ధలతో కలిసి మెలిసి జరుపుకుంటారు. హసేన్ హుస్సేన్ పగటి సవార్లు కొలువుదీరగా హిందూ ముస్లిం భక్తులు పెద్ద ఎత్తున సవార్లకు ప్రార్థనలు ఊదు. రంగుల దట్టీలు కుడకలు బెల్లం తయారు చేసిన బాసింగాలు తొట్టెలు ఇచ్చి. యాటపోతు కందుర్లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి వివిధ కోడళ్లలో డప్పు చప్పుళ్ల మధ్య పీరిల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో పీరీల సందడి వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా మత పెద్దలు, ముజావర్లు, భక్తులు, మొహరం కమిటీ, బాధ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, షేక్ ఖాదర్ బాబా, షేక్ షరీఫ్, షేక్ షబ్బీర్, షేక్ ఫకీర్, షేక్ లతీఫ్, షేక్ జావిద్, షేక్ బాల్ సైద్, షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖాజా, షేక్ పాషా, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

# ధార్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

* **అన్నదాన కార్యక్రమాలను ప్రోత్సహించాలి**
* **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



కొత్తగూడెం , ప్రజా స్ఫూర్తి : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ లో గల సాయిబాబా మందిర 16వ వార్షికోత్సవాల సందర్భంగా సాయిబాబా మందిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సందర్శించారు. అక్కడ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలను తిలకించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి దైవచింతన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం వంటి గొప్ప సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని ఇతరులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మానవ సేవయే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ గుర్తించి పేదలను ఆదుకోవడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పరుచూరి కృష్ణ మోహన్, రాంబాబు, నాగేశ్వర్ రావు, వాసిరెడ్డి ప్రసాద్, ఏపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఓటర్ల ఇంటింటి సర్వే: తహశీల్దార్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ముస్తాబాద్ మండలంలో అర్హులైన పౌరులను ఓటరు జాబితాలో చేర్చడానికి, అనర్హుల పేర్లను తొలగించడానికి "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ (సహాయ ఎన్నికల నమోదు అధికారి) ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నేడు, రేపు బి.ఎల్.ఓలు ప్రతి ఇంటికి వచ్చి ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారములను సేకరిస్తారని పేర్కొన్నారు. బి.ఎల్.ఓలు ఇంటికి వచ్చినప్పుడు ఓటరు తన 1 కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, తల్లిదండ్రులు, భాగస్వామి వివరాలతో పాటు 2002 ఓటర్ లిస్టు క్రమ సంఖ్య వివరాలను అందజేయాలని సూచించారు. మండల ప్రజలందరూ ఈ సర్వేకు సహకరించి, సరైన వివరాలు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ కోరారు

# ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి స్వస్తి పలికి..
# ప్రభుత్వ బడులను బతికించుకుందాం

* **గ్రామంలో ప్రైవేట్ బస్సులను నిలిపివేసి నిరసన తెలిపిన గ్రామస్థులు, యువకులు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రైవేట్ పాఠశాలల మోసపూరిత వ్యాపారాలకు, ఫీజుల దోపిడీకి స్వస్తి పలికి, పేద పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చదివించాలని ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామ యువత, పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకోవాలనే లక్ష్యంతో ప్రైవేట్ పాఠశాలల బస్సులు గ్రామంలోకి రాకుండా యువకులు, గ్రామ పెద్దలు కలిసికట్టుగా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోతుగల్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు జంగ రాజు, కోల కృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం కావాలని ఉపన్యాసాలు చెప్పే వారే తిరిగి ప్రైవేట్ విద్యాసంస్థలకు అండగా నిలబడటం శోచనీయమన్నారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని మండిపడ్డారు. నాడు ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా విషయాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ, బాధ్యతాయుతంగా చదివించేవారని పేర్కొన్నారు. ఎక్కములు, గుణింతాలు, తెలుగు పద్యాలు పూర్తిగా నేర్చుకొని చూడకుండా చదివే వరకు ప్రతిరోజు విద్యార్థులతో సాధన చేయించేవారని తెలిపారు. చదువు నేర్పే క్రమంలోనే విద్యార్థులను సరైన క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయులు దండించేవారని, అలా నాడు గురువులు కఠినంగా వ్యవహరించడం వల్లనే తాము ఈరోజు మంచి చదువు నేర్చుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబడగలిగామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు నాణ్యమైన చదువును, విలువలనూ పూర్తిగా గాలికి వదిలేసి కేవలం డబ్బే పరమావధిగా కమర్షియల్ వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని తీవ్రంగా విమర్శించారు. ఎల్‌కేజీ, యూకేజీల నుండే లక్షలాది రూపాయల ఫీజులు కట్టాల్సిన దారుణమైన పరిస్థితి నేడు సమాజంలో ఏర్పడిందని, ఈ ఫీజుల భారం భరించలేక సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులకు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం మన ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రభుత్వం ఉచితంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిందని, విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక శిక్షణ పొందిన, ఎంతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ప్రభుత్వ బడులలో కేవలం చదువు మాత్రమే కాకుండా విలువలతో కూడిన ఉత్తమమైన విద్యను అందిస్తారని వెల్లడించారు.నేడు సమాజంలో కేవలం ఆర్థికంగా వెనుకబడిన పేద పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, వారికి నైతికంగా అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనన్నారు. మనమంతా కలిసికట్టుగా ఉండి ప్రభుత్వ బడులను కాపాడి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగానికి చెందిన అన్ని రకాల సంక్షేమ పథకాలు, ఉచితాలు కావాలనుకునే మనకు... ప్రభుత్వ బడి మాత్రం ఎందుకు వద్దో సమాజం ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా మనమంతా ఏకమై ప్రభుత్వ పాఠశాలలలోనే మన పిల్లలను చదివించి ప్రభుత్వ రంగాన్ని బతికించుకోవాలని పిలుపునిచ్చారు. పోతుగల్ గ్రామస్తుల పూర్తి సహకారంతో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో, గ్రామంలోని విద్యార్థులందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పించేందుకు స్థానిక పాలకవర్గం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. గ్రామస్తులందరూ ఇలాంటి మంచి విషయాలకు సహకరించి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా చొరవ చూపి ప్రైవేట్ పాఠశాలల మోసపూరిత వ్యాపారాలకు స్వస్తి పలకాలని కోరారు. గ్రామంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూసేందుకు ప్రైవేట్ పాఠశాలల బస్సులను గ్రామంలోకి పూర్తి స్థాయిలో రానివ్వకుండా తమ నిరంతర ప్రయత్నం, పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.


# ఎయిమ్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఎయిమ్స్ బీబీనగర్ ఇంకా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మినీ మీటింగ్ హాల్ లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు , ఎయిమ్స్ బీబీనగర్ మధ్య సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వలన ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, క్యాన్సర్ చికిత్స వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు, గర్భిణీలకు (ఎఎన్సీ) ప్రత్యేక వైద్య సేవలు, రోడ్డు ప్రమాదాల అత్యవసర వైద్య సేవలు, క్రిటికల్ కేర్ యూనిట్, సాధారణ డయాగ్నస్టిక్ సేవలు, స్కానింగ్ సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్ సేవలు, ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సేవల విస్తరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుండి ఎయిమ్స్‌కు రిఫర్ చేయబడే రోగుల సమన్వయం కోసం ప్రతి ఆసుపత్రిలో లైజన్ అధికారులను నియమించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎయిమ్స్ తరపున జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో కూడా ఒక లైజన్ అధికారిని నియమించి రోగులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ఎయిమ్స్‌లో అందుబాటులో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలు, చికిత్సా సదుపాయాలు, హైరిస్క్ గర్భిణీలకు అందించే వైద్య సేవలు , రిఫరల్ విధానాలపై సమావేశంలో చర్చించారు. అలాగే ఎయిమ్స్ అందిస్తున్న "సంజీవిని" టెలిమెడిసిన్ సేవల ద్వారా నిపుణుల వైద్య సలహాలు పొందవచ్చని వివరించారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండే "స్వస్తి" యాప్‌ను మొబైల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకొని, ఎయిమ్స్ ఆసుపత్రికి 500 మీటర్ల పరిధిలో ఉన్నప్పుడు ఓపీ టోకెన్‌ను ముందుగానే బుక్ చేసుకోవడం ద్వారా వేగవంతమైన ఓపీ సేవలు పొందవచ్చని తెలియజేశారు.ఎయిమ్స్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలకు మరింత నాణ్యమైన మరియు విస్తృత వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కొండల్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డా. సూర్యశ్రీ రావు, ఎయిమ్స్ ప్రొఫెసర్లు, వైద్యులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జఫర్‌గఢ్ ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి సిజేరియన్ విజయవంతం

* **తల్లి, శిశువు క్షేమం.. వైద్య సిబ్బందిలో హర్షం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) లో తొలి సారిగా సిజేరియన్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి తల్లి, శిశువును క్షేమంగా వేరు చేసిన ఘటన వైద్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి గా నిలిచింది. వడ్డెగూడెం గ్రామానికి చెందిన రమ్య అనే గర్భిణికి ఆసుపత్రి గైనకాలజిస్టులు డాక్టర్లు ప్రాత సునిత శర్మ, శోభ, మత్తు వైద్యులు డాక్టర్ సుమన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ రవూఫ్ పర్యవేక్షణలో విజయవంతంగా సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. తల్లి, ఆడశిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మారుమూల ప్రాంతమైన జఫర్‌గఢ్ లోనే సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని వైద్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి కేసుల కోసం జిల్లా కేంద్రానికి లేదా ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు స్థానికంగానే సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రోత్సాహంతో ఆసుపత్రిలో శస్త్రచికిత్సల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించుకోగలిగామని సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని శస్త్రచికిత్సలు నిర్వహించి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో జఫర్‌గఢ్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవల విస్తరణలో మరో ముందడుగు వేసిందని అధికారులు పేర్కొన్నారు.

# ఆత్మహత్యకు కారకులైన ఐదుగురికి జైలు శిక్ష

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కవిత బుధవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం నెహ్రూనగర్‌కు చెందిన తగరం ముత్యాలరావు స్థానిక కెమిలాయిడ్స్ కర్మాగారంలో పనిచేసేవాడు. అతని భార్య శ్యామల అదే గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వర్లతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు ప్రియుడుతో కలిసి భర్తను మానసికంగా హింసకు గురిచేయడంతో మనస్థాపం చెందిన ముత్యాలరావు 2018 జులై 31న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకోవడానికి తన భార్య శ్యామలతోపాటు ఆమె ప్రియుడు తగరం వెంకటేశ్వర్లు కారణమని సూసైడ్ నోట్ రాశాడు. దాని ప్రకారం ఆనాటి ఎస్సై వేల్పుల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి విచారించారు. వాదోపవాదములు అనంతరం ఈ కేసులో నిందితులైన శ్యామలకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఆమె ప్రియుడు వెంకటేశ్వరరావుకు 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, అతని బంధువులు తగరం పుల్లారావుకు ఐదు సంవత్సరాల కారాగార శిక్ష, రామారావు, నరసింహులకు మూడు సంవత్సరాల కారాగార శిక్షతోపాటు నిందితులందరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడటంలో కృషిచేసిన కోర్టు కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కె.రాజారావు, పివిడి.లక్ష్మిలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రశంసించారు.

# విద్య,పాఠ్యపుస్తకాల వ్యాపారుల పై చర్యలు తీసుకోవాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఉత్తర్వులు అతిక్రమించినా విద్యా శాఖ అధికారులకు ఏమాత్రం పట్టింపు లేదని కాంపాటి పృథ్వీ పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, పాఠ్యపుస్తకాల వ్యాపారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు లెక్క చేయకుండా యదేచ్ఛగా విద్యాసంస్థలోనే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్ట్ తదితర వస్తువులను తమ ఇష్టం వచ్చిన ఖరీదు నిర్ణయించుకొని అమ్ముతూ కేవలం పాఠ్యపుస్తకాల మీదనే లక్షల రూపాయల లాభాలను గడిస్తున్నారని,పాఠ్య పుస్తకాల వ్యాపారాన్ని నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు కమిషన్ల కక్కుర్తిలో మునిగి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడాలని మానిటరింగ్ చేసే అధికారులకు ప్రభుత్వం లక్షల రూపాయల జీతభత్యాలను ఇస్తుంటే వారు మాత్రం ప్రభుత్వ నియమాలను పాటించకుండా దొడ్డి దారిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలలో జీవో నెంబర్ 91 ప్రకారం పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని అధికారులకు,విద్యాసంస్థల యాజమాన్యాలకు మధ్య ఉన్న ఒప్పందం ఎలాంటిదో అర్థమవుతుందని ఇట్టి విషయాలపై ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఓ మధ్య తరగతి పేదవాడు సంపాదించే సంవత్సర ఆదాయంలో 40 శాతానికి పైగా స్కూల్ ఫీజులు, పాఠ్యపుస్తకాలకే కేటాయించాల్సిన దుస్థితి ఏర్పడిందని దీనితో వారి జీవన మనుగడే ప్రమాదంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని చేసి అమలు చేయాలని, పాఠ్యపుస్తకాల వ్యాపారం చేయకుండా అధికారులు అడ్డుకోవాలని లేనిపక్షంలో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ప్రవేట్ విద్యా సంస్థలలో ఉన్న పుస్తకాల గోడౌన్లకు జిల్లా కలెక్టర్లను రప్పించేందుకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రైవేటు విద్యాసంస్థల వ్యాపారాన్ని నియంత్రించే చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి వస్తుందని వారు మండల,జిల్లా విద్యాశాఖ అధికారులను ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# విద్యార్థులు లక్ష్యం మీద గురిపెట్టండి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

* **విద్యార్థులతో కలిసి గంజాయి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన "మన ఊరు - మన బాధ్యత" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పాల్గొని విద్యార్థులకు గంజాయి,ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 9వ, 10వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, ఒక్కసారి వాటికి బానిసైతే చదువు, ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు.విద్యార్థి దశలో లక్ష్యాలపై దృష్టి సారించి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.గంజాయి సాగు, రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం అందించిన వారికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేయబడుతుందని తెలిపారు.ఎలాంటి సమాచారం ఉన్నా 87126 56999 నంబర్ తెలియజేయాలని కోరారు.

# బాలమిత్ర పాఠశాలలో నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పద మృతి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని బాలమిత్ర పాఠశాలలో ఘోర విషాదం చోటుచేసుకుంది. నర్సరీ చదువుతున్న ఈజ మెహరిన్ (4) అనే చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. సాయంత్రం స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో, తాను ముందుగా బస్సు ఎక్కుతానని చిన్నారి ఏడ్చింది. దీనికి పాఠశాల సిబ్బంది నిరాకరించి, తర్వాత పంపిస్తామని చెప్పడంతో భయపడిపోయిన బాలిక ఏడుస్తూ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పాఠశాలకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారి మృతికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ ప్రారంభించారు. ఈ ఘటన పాఠశాల ప్రాంగణంలోనే జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై చిన్నారి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం నుంచి వివరాలు సేకరించి వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, అధికారుల పూర్తి ప్రకటన రావాల్సి ఉంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# నానక్రామ్ గూడ రోడ్డుకు ట్రంపు పేరు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలి

**- ఎస్. వీరయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: హైదరాబాదులోని నానక్రామ్ గూడ ప్రాంతంలోని రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడం దారుణమైన చర్యని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో బూరుగు కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య హాజరై మాట్లాడారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రజల పోరాటాలు, ప్రముఖుల సేవలను గుర్తిస్తూ పేర్లు పెట్టాల్సిన రోడ్లకు అమెరికా సామ్రాజ్యవాద, యుద్ధోన్ వాది, విదేశీ రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. తెలంగాణ ప్రజలతో, హైదరాబాద్ నగర చరిత్రతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తి పేరును రోడ్డుకు పెట్టడాన్ని ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక చరిత్రకు, ప్రజా ఉద్యమాలకు సేవలు అందించిన మహనీయుల పేర్లను రోడ్లు, ప్రజా సంస్థలకు నామకరణం చేయాలని సూచించారు, తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ నానక్రాం గూడ రోడ్డుకు పెట్టిన ట్రంప్ పేరును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, నాయకులు శ్రీనివాస చారి, ఎండి పాషా, గంగాదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, గోశిక కరుణాకర్, మధు, పొట్ట శ్రీను, బోయ యాదయ్య, పల్లె మధు కృష్ణ, తడక మోహన్, తొర్పునూరి మల్లేశం, బొడ్డు అంజిరెడ్డి, గుణముని ఐలయ్య, ఈ దయ, జంగయ్య, రాములు, మహేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి:

# సీబీఎస్ఈ అనుమతులు లేకున్నా చర్యలు శూన్యం

**- తీగుళ్ళ శ్రీనివాస్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విధి నిర్వహణలో అంకితభావం లేని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ, విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. విద్యా వ్యాపారాలను నియంత్రించాల్సిన అధికారులు వాటిపై చర్యలు తీసుకోవడం మానేసి ప్రోత్సహిస్తున్న పరిస్థితి నెలకొందని ఆరోపించారు. చౌటుప్పల్ మండలంలో సీబీఎస్ఈ అనుమతులు లేకుండానే సీబీఎస్ఈ పేరుతో నడుస్తున్న పాఠశాలలు అనేకం ఉన్నాయని, వాటిపై జిల్లా విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వ్యాపారాలు నిర్వహిస్తూ, తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నా, సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలకు అండగా ఉండడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డీఈఓ వ్యవహార శైలిపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా సతీష్ కుమార్




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఇన్చార్జిగా ఉన్న ఈవో కృష్ణమాచార్యుల స్థానంలో నూతన ఈవోగా సతీష్ కుమార్ పదోన్నతి పై నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన శ్రీ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ వివాహాలే సమాజానికి మేలు

* **ప్రపంచంలో సివిల్ మ్యారేజ్ లకు ఆదరణ పెరుగుతుంది**
* **సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి. రాఘవులు**



కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి: భద్రాద్రి కొత్తగూడెం సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రమ దంపతుల కుమారుడు భరత్ వెడ్స్ సౌజన్య వివాహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షత వహించగా బివి రాఘవులు ఆచార్యులుగా జరిపించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ నేటి సమాజంలో పెళ్లిళ్లు అబ్బాయి, అమ్మాయికి సంబంధం లేకుండా వాణిజ్యపరమైన దృక్పథంతో జరుగుతున్నాయన్నారు. వివాహ వేడుకలకు ఖర్చు విపరీతంగా పెట్టి సామాన్య, మధ్య తరగతిలో జీవితాలపై ప్రభావం చూపించే విధంగా ఉన్నాయని అన్నారు. ఉన్నత వర్గాల వారు వివాహ వేడుకలను అట్టహాసంగా చేస్తున్నారని, దీన్ని చూసి పేద, మధ్యతరగతి వారి పిల్లల వివాహాలను జరిపించి అప్పుల పాలవుతున్న విషయాన్ని సందర్భంగా గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలో వివాహ వేడుకలు సాధారణంగా ఉంటాయని, అట్టహాసంగా జరగవని తెలిపారు. భారతదేశంలో మాత్రమే పెళ్లిళ్లు ఇరువర్గాల మధ్య పెళ్ళి తంతుకాకుండా మార్కెట్ లో వస్తువుల కొనుగోళ్ళకి, వేడుకలకు ఎక్కువగా వెచ్చించి, విచ్చలవిడిగా ఖర్చులు పెడుతున్నారని అన్నారు. ఒకప్పుడు చాందస సాంప్రదాయ భవాల పెళ్లిళ్లు జరిగిన తీరును తెలుపుతూ ఆదర్శ వివాహాలు సమాజానికి ఎంతో మేలని అన్నారు. పెళ్లి వేడుకల ఖర్చు తగ్గించు కోవచన్నారు. వివాహ అనంతరం భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యం ఉంటుందని, ఆదర్శ వివాహాల వలన స్త్రీ సమనత్వం, మహిళా ప్రాధాన్యత లభిస్తుందన్నారు. అనంతరం సౌజన్య, భరత్ లు ఇరువురు వివాహ ప్రమాణ పత్రాలు చదివి సంతకాలు చేశారు. వివాహ వేడుకలో తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పాల్గొని ఆదర్శ వివాహం చేసుకున్న ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ నున్న నాగేశ్వరరావు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె .షాబీర్ పాషా మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న ,టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు ,టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం వివిధ పార్టీల నాయకులు, శ్రేయోభిలాషులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# ప్రతిపక్షంలో ఉన్నా.. అధికార పక్షంలో ఉన్నా..
# నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడను

* **నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అందర్నీ సమన్వయం చేసుకోవాలి**
* **పార్టీని బలోపేతం.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
* **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతిపక్షంలో ఉన్నా.. అధికార పక్షంలో ఉన్నా.. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిలో మాత్రం రాజీ పడనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల, అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నాయకుడు ప్రజలకు దగ్గరగా ఉండి, వారి బాధలు విని, వారిని గౌరవించినప్పుడే నాయకుడిగా ప్రజల్లో మనగలుగుతాడన్నారు. గ్రామస్థాయిలో, మండల స్థాయిలో, పట్టణ స్థాయిలో నియోజకవర్గస్థాయిలో అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే సరైన ఫలితాలు వస్తాయన్నారు 2018ఎన్నికల్లో మొత్తం టిఆర్ఎస్ పార్టీ గెలిస్తే మునుగోడు లో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు. అందరూ కష్టపడతారని రాజకీయాలలో ఉండేవారు ఓపికతో పనులు చేసుకుంటూ పోతే పదవులు వస్తాయన్నారు. నాయకుడు వ్యక్తిగతంగా మంచివాడా కాదా, ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడా లేదా, ప్రజలకు మంచి పనులు చేస్తున్నాడా లేదా, అని ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారన్నారు. గెలిచిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తే వచ్చేసారి ప్రజల తీర్పు వ్యతిరేకంగా ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి నాయకుడు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ , చౌటుప్పల మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాజగోపాల్ రెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మ గౌడ్, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మండల ముఖ్య నాయకులు, మున్సిపల్ ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగం..
# పర్యావసానాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన

**- సీఐ జి. మన్మధ కుమార్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, సమాజం, యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని అంగన్వాడి టీచర్లకు మాదకదవ్యాల వినియోగం పర్యవసానాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు గ్రామస్థాయిలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు, తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలలో చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లు పెంపొందించడం, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అందరితో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు అంగన్వాడీ టీచర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలను అభినందించి, పాల్గొన్న ప్రతి ఒక్కరిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండి హన్ను బాయ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పాక చిరంజీవి, అంగన్వాడీ టీచర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధి కి పాటుపడాలి

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె. పి. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధి కి పాటుపడాలని బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమం, కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామని కమిటీ సభ్యులుకు ఎమ్మెల్యేలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుంచల అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి. విక్రమ్, కోశాధికారి పి. సంపత్ రెడ్డి, కాలనీ ప్రముఖులు చింతకింది వెంకటేష్, మహిపాల్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వెంకటేష్ గౌడ్, రమేష్, సర్వన్, బ్రహ్మ, సుబ్బారావు, రాజేష్ కుమార్, సతీష్, టి. శ్రీనివాస్, అవినాష్, జి. రాజేందర్ రెడ్డి, సిహెచ్ అశోక్, ఎమ్. వేణుగోపాల్, షేక్ ముబిన్, టి. రవి కుమార్, ఫణీంద్ర, నవీన్, ఎన్. అవినాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రదు చేయాలి

**- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి**
**- అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాలు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వివిధ సంఘాల నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ , పల్లె మధు, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, కట్టెల లింగస్వామి, బండిగారి శ్రీధర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రం పీబీ గార్డెన్‌లో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీ, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు, విద్యాహక్కు చట్టం అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, విద్యార్థులు, తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం-2009ను ప్రైవేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతూ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, రవాణా ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ఇష్టారాజ్యంగా వేలాది రూపాయలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. మండలంలో అనుమతులు లేకుండా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు లేకుండా పాఠశాలలను నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనన్నారు. ఇలాంటి పాఠశాలలను గుర్తించి వెంటనే గుర్తింపు రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25శాతం ఉచిత సీట్ల అమలులో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల అక్రమాలను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, కొందరు అధికారులు యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత నిర్ధారణ అయితే వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, తల్లిదండ్రుల సంఘాలతో కలిసి మండల, జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు లింగస్వామి, ఖయ్యూం, రాఘవ, ఇర్ఫాన్, పందుల శరత్, లింగస్వామి, గంగాదేవి శివ, అత్తు, చింటూ, మాజీ రెడ్డి సాయి, శ్యాంసుందర్, చిలువేరు సైదులు, శివ, పల్చం శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభం




కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రగతినగర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి ఆయన తో పాటు డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉన్నత ప్రమాణాలతో కూడిన ఐఐటీ జేఈఈ/నీట్, ఒలంపియాడ్, ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు రోబటిక్ సైన్స్ ల్యాబ్, గేమ్స్ కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ డైరెక్టర్లు రవిరాజు, లక్ష్మీనారాయణ, కమలేష్ ముఖర్జీ, మేఘారెడ్డి, ప్రిన్సిపల్ విజయ భారతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మధుర పరిమళాల మనోహరం!

ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.







హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన






కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..



**వడదెబ్బ తగలకుండా..!**

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

## ఓటీటీలోకి ప్రీతిముకుందన్ మూవీ..



సినీప్రియులకు గుడ్‌న్యూస్. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్నా ప్రీతిముకుందన్, అర్జున్ సర్జా నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లాస్ట్' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. మౌత్ టాక్‌తో మంచి వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం.. ప్రస్తుతం ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. పెద్దగా అంచనాలు లేకుండా మే 28న థియేటర్లలో విడుదలైన 'బ్లాస్ట్' తర్వాతి రోజుల్లో పాజిటివ్ రెస్పాన్స్‌తో బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకుంది. కథలోని టెన్షన్, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను చివరి వరకు కట్టిపడేశాయి. సీనియర్ నటుడు అర్జున్ సర్జా తనదైన శైలిలో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా.. ప్రీతి ముకుందన్ తన పాత్రకు న్యాయం చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అభిరామి, జాన్ కొక్కెన్ వంటి నటులు కూడా కీలక పాత్రల్లో మెప్పించారు. ఈ సినిమాను ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించగా.. సంగీత దర్శకుడు రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకుంది. సాంకేతికంగా కూడా సినిమాకు మంచి మార్కులే పడ్డాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమైన ఈ చిత్రం ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఇదిలా ఉండగా.. హీరోయిన్ ప్రీతి ముకుందన్ మోడలింగ్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తక్కువ సమయంలోనే వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. 'బ్లాస్ట్' సినిమాతో ఆమెకు గుర్తింపు మరింత పెరిగిందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సహజమైన నటనతో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ కారణంగా యంగ్ ఆడియన్స్‌లో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ప్రస్తుతం ప్రీతి ముకుందన్ కొన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. తెలుగు, తమిళంతో పాటు హిందీలోనూ ఓ సినిమా చేస్తోంది.

సినిమా

## చర్చంతా జాన్వీ గురించే..!



రామ్ చరణ్–బుచ్చిబాబు కాంబోలో వచ్చిన 'పెద్ది' మూవీ సక్సెస్‌ఫుల్ టాక్‌తో దూసుకుపోతున్నది. తాజాగా మూవీ విజయోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబుతో పాటు యూనిట్ అంతా సందడి చేసింది. హీరోయిన్ జాన్వీ కపూర్ మాత్రం కనిపించలేదు. ఈ వేడుకలకు హాజరుకాకపోవడం సర్వత్రా చర్చకు దారి తీసింది. పెద్ది రిలీజ్‌కు ముందు ప్రచార కార్యక్రమాల్లో జాన్వీ పాల్గొంది. రిలీజ్ తర్వాత మాత్రం ఎక్కడా కనిపించలేదు. సినిమా గురించి గానీ, తన పాత్ర గురించి గానీ ఎక్కడా స్పందించింది లేదు. సోషల్ మీడియాలోనూ ఒక్క పోస్టు పెట్టకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మూవీలో జాన్వీ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించింది. పాత్ర నిడివి, ప్రాధాన్యంపై రిలీజ్ తర్వాత సోషల్ మీడియాలో చర్చ జరిగింది. దర్శకుడు బుచ్చిబాబుకు సైతం విమర్శలు తప్పలేదు. పాత్ర విషయంలో ప్రేక్షకుల అంచనాలు ఒకలా ఉండగా.. తెరపై కనిపించిన తీరు మరోలా ఉండడంతో అసంతృప్తి వ్యక్తమైంది. అయితే, తాజాగా విజయోత్సవ వేడుకలకు జాన్వీని ఆహ్వానించారా.. లేదా అన్న విషయంలో క్లారిటీ లేకపోయినా కనిపించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టుపై జాన్వీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. రిలీజ్ తర్వాత మాత్రం సైలెంట్‌గా ఉండడం హాట్ టాపిక్‌గా మారింది.



## 'అరసన్'లో ప్రియాంక మోహన్ కొత్త అవతారం

గ్లామర్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రియాంక అరుళ్ మోహన్.. తాజాగా పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించేందుకు సిద్ధమవుతోంది. స్టార్ దర్శకుడు వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు హీరోగా తెరకెక్కుతున్న 'అరసన్' చిత్రంలో ఆమె డీ–గ్లామర్ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. నార్త్ చెన్నై నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ప్రియాంక సహజత్వానికి దగ్గరగా ఉండే పాత్రలో కనిపించనుంది. మేకప్, గ్లామర్‌కు దూరంగా ఆమె లుక్ ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ప్రారంభమైన తాజా షెడ్యూల్‌లో ప్రియాంక పాల్గొనగా.. ఆమె పాత్రకు సంబంధించిన వివరాలు బయటకు వచ్చాయి. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. కలైపులి ఎస్ థాను నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.

## అప్పుడు నాన్నకు బాగా కోపం వచ్చింది..



నటి శ్రుతి హాసన్ తన టీనేజ్ రోజుల నాటి ఓ ఆసక్తికర సంఘటనను అభిమానులతో పంచుకుంది. 19 ఏళ్ల వయసులో తాను తీసుకున్న ఓ నిర్ణయం తన తండ్రి కమల్ హాసన్‌కు తీవ్ర కోపం తెప్పించిందని వెల్లడించింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు శ్రుతి సమాధానాలు ఇచ్చింది. ఈ సందర్భంగా ఓ అభిమాని, "మీకు బెల్లీ బటన్ పియర్సింగ్ ఉందా? ఉంటే ఎప్పుడు చేయించుకున్నారు?" అని ప్రశ్నించాడు. దీనికి స్పందించిన శ్రుతి.. తన బెల్లీ బటన్ పియర్సింగ్‌కు సంబంధించిన ఫొటోను పంచుకుంటూ ఆ రోజులను గుర్తు చేసుకుంది. "అవును, నాకు పియర్సింగ్ ఉంది. 19 ఏళ్ల వయసులో చేయించుకున్నాను. ఆ విషయం తెలిసి మా నాన్న చాలా చాలా కోప్పడ్డారు" అని పేర్కొంది. ఈ పోస్టుకు #TeenageRebel' అనే హ్యాష్‌ట్యాగ్‌ను యాడ్ చేసింది. కమల్ హాసన్, నటి సారిక దంపతుల పెద్ద కుమార్తె అయిన శ్రుతి హాసన్, తన తండ్రితో ఉన్న అనుబంధం గురించి గతంలోనూ పలుమార్లు ప్రస్తావించింది. ఇద్దరి మధ్య ఉండే సరదా సంభాషణలు, ఆప్యాయత అనుబంధానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది.

## 'వారణాసి' షూట్‌కు బ్రేక్..



సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' షూటింగ్‌లో నిమగ్నమై ఉన్న సంగతి తెలిసిందే. వరుస షెడ్యూళ్లతో బిజీగా గడుపుతున్న ఆయన, తాజాగా షూటింగ్‌కు స్వల్ప విరామం ఇచ్చి కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారతో కలిసి మహేష్ బాబు హైదరాబాద్‌లో విమానాశ్రయంలో కనిపించారు. ఈ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.